# భిన్నహృదయాలు

"సుగుణా! త్వరగా యిలారా ఒక సారి!"—అంటూ గోపాలం కేక వేశాడు. సమాధానం లేదు. "నీకు పుణ్యముంటుంది! ఓ సారి యిలా రద్దూ! అంటూ మళ్ళీ కేకేశాడు.

అది శరద్రాత్రి. ఆకాశంలో నక్షత్రాలు అక్కడక్కడ మినుకుమినుకుమంటున్నాయి. పండువెన్నెల నిచ్చే నిండుపున్నమ చంద్రుణ్ణి చూస్తూ దొడ్లో ఆరుబయట గోపాలం ఒంటరిగా కూర్చున్నాడు. మందమలయమారుతం వీస్తుంటే చంద్రుడు తన చల్లని తెల్లని వెన్నెలతో ప్రపంచాన్నంతటినీ సమ్మోహింప చేస్తున్నాడు. తానొంటరిగానే కూర్చున్నానని జ్ఞప్తికి రాగానే గోపాలం భార్యని పిలిచాడు, ఆ ఆనందానుభూతిలో అర్ధభాగం అందివ్వడానికి కాబోలు.

కొద్ది క్షణాలకు గోపాలం ఏం చెపాడో అని ఆశతో—కాదు ఆశ్చర్యంతో వచ్చింది సుగుణ! అంత అర్జంటుగా ఎందుకు పిలిచాడో అర్థంకాక అమాయకంగా చూస్తూ నిలబడింది.

"సుగుణా!—యిలా చూడు!—ఈ రాత్రి ఎంత హాయిగా ఉందో! ఈ వెన్నెల ఆ చంద్రుడు—ఈ మందమలయమారుతము ఆ మల్లెపూల ఘుమఘుమలు—సంవత్సరం పొడుగునా యిలాగే ఉంటే ఎంత బాగుండేది?" — అంటూ కవిత్వధోరణి సాగించాడు గోపాలం?

సుగుణ తెల్లబోయింది. ఆమెకు ఏం సమాధానం చెప్పాలో అంతకన్నా అర్థం కాలేదు. ఏదో పనుండి పిలిచాడనుకుంది. కాని యిలాటి కవితోపన్యాసము యిస్తాడనుకోలేదు. ఇలాటి ఊకదంపుడు ఉపన్యాసాలామెకేం కొత్తగాదు. సుమారు ఆమె వచ్చిన యేడాదినుంచి యిది నిత్యం ఉండేదే!—నిజంగా ఆ రాత్రి చాల హాయిగానే ఉంది!—కాదని ఎవరన్నారు? అయినంత మాత్రాన ప్రతి వ్యక్తికీ సుఖమే కాని దుఃఖం ఉండదనా!—జీవితమంటేనే సుఖదుఃఖమయము—అని పాపం అమాయకురాలైన తనభర్తకు తెలియదనుకొంది సుగుణ!

తన భావావేశానికి సుగుణ వంతపాడుతుంది అని ఎంతగానో ఆశించి ఎదురు చూస్తున్నాడు గోపాలం!...కాని ఆమె అన్నివిధాల మంచిదని మౌనం వహించింది. దాంతో గోపాలం కొంచెం దెబ్బతిన్నాడు. "ఇలాంటి సుందరదృశ్యాల్ని చూస్తుంటే నీకానందం కలగడం లేదా సుగుణా!"—అన్నాడు గోపాలం.

"అలాటివి చూచి ఆనందించడానికి కవులైనా కావాలి లేక కనీసం కవితా హృదయమేనా ఉండాలి!—నాకా రెండూ లేవు" అంది మెల్లగా!

"ఆ! నువ్వెప్పుడూ యిలాగే అన్నావు!" అంటూ కొంచెం విసుక్కున్నాడు.

ఆ చల్లని వెన్నెలరాత్రిలో ఆమెను దగ్గరగా చేరదీసి తనివితీరా ముద్దాడుదామన్నంత ఆవేశంతోనూ, ఆశతోనూ ఆమెను పిలిచాడు. కాని అంతా తలక్రిందులయింది. చల్లటిగాలి నరాల్ని పీకినట్లనిపించింది. గోపాలం ఉద్రేకం తగ్గి చల్లబడ్డాడు. సుగుణ మారుమాటాడకుండ లోపలికెళ్ళిపోయింది.

**సోమంచి రామం**

ఇలాటి నిస్తేజమైన, నిస్సారమైన జీవితం గడపడానికా తానామెను వివాహమాడింది? - ఆమెతో ఏడాది కాపరం చేశాడు అప్పుడే! - అయితేయేం అందం, ఆనందంలేని జీవితం - ఆమెపై తాను పెట్టుకున్న ఆశలన్నీ నిరాశలయ్యాయి. తన ఊహాశక్తిని అర్థం చేసికోలేకపోతోంది ఆమె - ఇంతెందుకు? ఆమెకు తనకి మధ్య ఓ అగాధం అడ్డం ఉంది. ఆమెతో ఆదర్శ జీవితాన్ని గడపాలనుకున్నాడు గోపాలం. కాని ఆ క్షణంతో అర్థంచేసికొన్నాడు అదిమాత్రం అసంభవం అని - మంచి వయస్సులో, ఆరోగ్యంగా ఉండి అన్నివిధాల చక్కగా ఉన్న తాను ఆమెతో యిలా మొండిబారిన సంసారం ఎన్నాళ్ళు గడపగలడు? పదే పదే సార్లు యీ ప్రశ్న అతని బుర్రలో మెదిలింది. సమాధానం - ఏమయినాసరే! దీనికంతు తేల్చుకోవాలనుకున్నాడు.

అలాగే అక్కడే కూర్చుని ఆలోచిస్తున్నాడు గోపాలం! ఆ సమయంలో అతని మనస్సు పరిపరివిధాల పరుగెత్తింది. గతించిన మధురస్మృతులు - తన బాల్యజీవితం జ్ఞప్తికి రాసాగాయి.

నిజంగా తానెంత అదృష్టవంతుడు! ఆ రోజుల్లో-కాలేజీ రోజుల్లో అతనికి ఆంధ్రా షేక్స్పియరు అని పేరుండేది? గోపాలం అంటే తెలియని వారిక్కడ ఆ పేరు తెలుసు! పేరుకు తగ్గట్టుగానే కవిత్వం రాసేవాడు - మెప్పుపొందేవాడు. విశాలమైన ఆ నేత్రాలు, ఆ గిరజాలజుట్టు - ఆ నుదురు - అన్నీ కవితాలక్షణాలే నని పొగడేవారు. అసలు యింకా వెనక్కిపోతే ఆతను బాల్యమునుంచీ అదృష్టవంతుడే!

* * *

గోపాలం తల్లిదండ్రులు మంచి గౌరవ సంప్రదాయాలు కల కుటుంబీకులు. తండ్రి తాతలనుంచి వంశపారం పర్యావస్తున్న కవిత్వమే గోపాలానికీ అలవడింది. అయితేయేం గోపాలం దాన్ని జీవనోపాధిగా తలంచకూడదనుకున్నాడు. కాలక్షేపార్థం కవిత్వం వ్రాయాలి కాని కట్టుకున్న భార్యబిడ్డలు కూడుగుడ్డలేక కుమిలిపోతూంటే తాను కవితాలోకంలో కలలుకంటూ కాలం గడపడం చాల హేయమని గట్టిగ విశ్వసించాడు గోపాలం.

తన చిన్నతనమునుంచీ తానెంతో సుఖప్రదమైన జీవితాన్ని గడపాలని, గడుపుతానని ఆశించాడు. చదువుకునే రోజుల్లో స్కూల్లో బహుమతులన్నీ తనవే! తాను లాయరు అవుతానని తల్లితో పందెం వేశాడు. వాదనాశక్తి - మొండివాదం తన కెక్కువగ చేతవునని గోపాలం అభిప్రాయం - కాని ప్రఖ్యాత రచయితగ తయారవవలసిన గోపాలాని కొప్లిడరీవృత్తి? - గోపాలం కాలేజీ చదువు కూడా చాల చిత్ర విచిత్ర సంఘటనలతోనే గడిచింది. సమాజ దురాగతాలు, సాంఘిక దురాచారాలు అతని కళ్ళకు కట్టినట్లు కనబడ్డాయి. అందుకు కారణము - తనకు సీనియరు అయిన బాల్య వితంతువుతో అతనికి పరిచయ మేర్పడడమే - ఆమె స్థితికి తానెంతో బాధ పడ్డాడు. జాలిపడ్డాడు. ఆమె తరఫున వాదించాడు. సంఘం మాయా అద్దంలాంటిదన్నాడు. సంఘపు కట్టుబాట్లు మనచేతనే నిర్మింపబడ్డాయి. అవసరమైతే వాటిని తెంపెయ్యాలని ఉద్రేకంతో ఉపన్యాసాలిచ్చాడు. ఫలితం! - ఫ్రెండ్సంతా అతన్ని హేళన చేశారు.

ఈలాటి సమయంలో గోపాలానికి తన పెళ్ళి ఒక పెద సమస్యఅయి కూర్చుంది. పెళ్ళిమాట తలపెట్టేసరికి తానేదో పెద్దగోతిలో ఊబిలో దిగబడుతున్నానన్నట్లు భావించేవాడు. ఆ ఊబిలో కాలు పెట్టడానికి చాల ధైర్యం ఉండాలని గోపాలం అభిప్రాయం. అందుకోసమే మానసికంగా

# ★ భిన్న హృదయాలు ★

ఎంతో ధైర్యాన్ని నిలవచేయసాగాడు. అతను కాలేజీలో చదివిన మొదటి రెండేళ్లలోను అతని క్లాసులో ఆడపిల్లలు లేరు. ఛా! ఛా; – ఎంత దురదృష్టం – నిజంగా దురదృష్టం కాకపోతే తన సీనియర్ క్లాసులోనూ ఉన్నారు. తన జూనియర్ క్లాసులోనూ ఉన్నారు. తన ఖర్మ కాకపోతే తన క్లాసులో నేనా లేకపోవడం – ఎంత నిర్భాగ్యుడు తాను? – "పోనీ యీ కాలేజీ మారితేనో" – అనుకున్నాడు గోపాలం – అంతే!—

అదిగో! సీతాకోకచిలకలా కలకలాడే కోమలాంగుల మధ్య గోపాలం – మొత్తానికి అనుకున్నంతా అయింది! తాను కోరినట్లుగానే తన క్లాసులో ఆడపిల్లలున్నారు – కాదు. తానాడపిల్లల క్లాసులో ఉన్నాడు. ఈసారి ఏదో ఉధృతము జరగవచ్చు ననుకున్నాడు. ఏడాది గడిచింది. ఏమీ జరగలేదు. ఇంతా చేసి తన క్లాసులో ఉన్న ఆడపిల్లలు నలుగురు. అందులో ఒక అమ్మాయి బాగానే ఉంటుంది. అన్నివిధాల తన ఆదర్శాలకి తగినట్లుగానే ఉంది! అదృష్టం తనదేనని ఉప్పొంగిపోయాడు గోపాలం!– పాపం! అయితేయేం? ఆ అమ్మాయికి పెళ్ళి అయిపోయింది!– ఇక యింకో అమ్మాయి– ఓ మోసరుగా బాగానే ఉంటుంది. అందరి దృష్టుల్ని ఆకర్షిస్తున్నట్లుగా ఓరగా చూస్తూంటుంది. ఫర్వాలేదనుకున్నాడు గోపాలం. పాపం! అయితేయేం? ఆ అమ్మాయి పరిత్యక్త! భర్త ఆమెను వదిలేశాడంటారు కొందరు ఆడవాళ్లు! లేదు ఆమే భర్తను వదిలేసిందంటారు కొందరు మగవాళ్ళు! ఏదైతేనేం? ఇక మూడో అమ్మాయి– ఈడురోమంటూ ఎక్కడేశావే గొంగళి అన్నసామెతగా ఉంటుంది. నాలుగో అమ్మాయి. ఆ! వేరే చెప్పడంకూడా ఎందుకు? మరిఅయితే యిక తాను పెళ్ళిచేసికోవాల్సిం దెవర్ని?– తాను నిర్మిస్తున్న ఆదర్శసౌధం కూలిపోవాల్సిందేనా ఇంకా కాలేజీలో చాలామంది ఆడపిల్ల లున్నారు. అయితేయేం! ఎదుటపడి అడగటానికి ఆత్మాభిమానం అడ్డుతగిలింది. అంతకన్న ముఖ్యం ధైర్యం చాలదు గోపాలానికి!

ఇక యింటిదగ్గర గోపాలం తల్లి తండ్రులకి గోపాలం పెళ్ళివిషయం ఎక్కువగా బాధించసాగింది. గోపాలం తండ్రి తన స్నేహితుడి కూతుర్ని చేసుకోవడానికి అంగీకరించాడు. కాని గోపాలం తల్లిమాత్రం అందు కొప్పుకోలేదు. కారణం కోడలు కట్నం ఏమాత్రంతేలేదు. అంతే! ఆ సంబంధంవల్ల కొదన్నది ఆ తల్లి! గోపాలం తండ్రి కేమీ పాలుపోలేదు. గోపాలానికి తెలియపర్చాడు ఈ సంగతి. గోపాలానికి కట్నమంటే తగనిమంట. మరి అభ్యుదయవాదికదూ! పరాయివాళ్ళ సొమ్ముమీద బ్రతకడం తనకు పశువుతక్కువ అన్నాడు గోపాలం; కొడుకు తనపక్షమే అవడంతో తండ్రికి కొంచెం ధైర్యంవచ్చింది శెలవలకు గోపాలం యింటికొచ్చాడు. పెళ్ళికూతుర్ని చూసుకుందుకు వెళ్ళాలన్నారు. పెళ్ళికూతురు సుగుణని చూశాడు గోపాలం. ఫరవాలేదనుకున్నాడు. అంత అపురూప సౌందర్యవతి కాకపోయినా అనాకారి మాత్రం కాదు. పెద్ద కాలేజీచదువు చదువుకోకపోయినా ఆమెలోని నిర్మలత్వము, అమాయకత్వం గోపాలాన్ని ఆక[illegible]చాయి

అని చెప్పకతప్పదు. తాను నిర్మించబోయే ఆదర్శ సౌధానికి అండదండగా నిలిచేందుకు అలాంటి అమాయకపు ఆడపిల్లకే అర్హత ఉంది. అని నిర్ణయించాడు. తన కవితాలోకంలో చేయి చేయి కలిపి విహరించడానికి అలాటి నిర్మల హృదయానికే అవకాశంఉంది అని నిశ్చయించుకున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే—కవితాశక్తి, కవితా హృదయం, కలిగిన గోపాలం ఎన్ని కష్టాలొచ్చినా, ఎన్ని అవాంతరాలొచ్చినా సుగుణనే వివాహమాడాలని నిర్ణయించుకున్నాడు.

మంగళవాయిద్యాలు మారోగుతుంటే మహావైభవంగా నిర్విఘ్నంగా గోపాలం పెళ్ళిఅయింది. గోపాలం ఫ్రెండ్సంతా వచ్చారు. పెళ్ళికూతురు బాగానేఉంది అని సర్టిఫికేటు యిచ్చారు అంతాచేరి. సందడి తగ్గగానే పందిళ్లు తీసేశారు. గోపాలం కాలేజీకి వెళ్ళిపోయాడు. ఆఖరిసంవత్సరం-కష్టపడి చదవాలనుకున్నాడు. కాని కాలేజీ యూనియన్ ప్రెసిడెంటుగా నిలబడి నెగ్గాల్సొచ్చింది. ఆదరంతో అందరు అభినందించారు. చేతిక్రింద పదిమంది సెక్రటరీలతో గోపాలం మా 'బిజీ'గా ఉన్నాడు. గోపాలం ప్రియమిత్రుల్లో వివాహిత సూరి ఒకడు. సూరి ప్రోత్సాహంతో సుగుణకు ప్రణయలేఖలు-తొలిసంసారపు ప్రేమలేఖలు-వ్రాయసాగాడు గోపాలం:-సూరి మా చెడ్డమాటకారి! చమత్కారి-డిబేట్లలో చాల గల్లంతుగా మాట్లాడుతాడు. తాను ఉపన్యాసంఇస్తుంటే అందులో తప్పులుండవు. పైగా ఎవరేనా మాట్లాడుతుంటే అందులో చాలా స్పెల్లింగ్ తప్పులున్నాయంటాడు లేచి. స్పీచ్ లో స్పెల్లింగ్ తప్పులేమిటో!–అలాటి అల్లరి సూరి గోపాలందగ్గరచేరి "నేనివాళ సరళతో గంట-గంటేం-గంటన్నరసేపు కబుర్లాడాను" అంటాడు. గోపాలం ఆత్రుతతో–"దేన్ని గురించి?" అనేవాడు. "అది చాల రహస్యమయిన విషయం" అయినా పెళ్ళయినవాళ్లు సంసారపు సంగతుల నేకం మాట్లాడుకుంటారు. నీకేతెలుసు:-నువ్వు వట్టి ఫ్రాడివి!" అనేవాడు గొప్పగా సూరి! సరళ కూడా 'పెళ్లయిన' వాళ్ల క్లాసు మేటు!–సూరి చెప్పేదంతా వట్టిగాసు అని గోపాలానికింకా తెలియదు. సూరి సరళకు అప్పుడప్పుడు పుస్తకాలు యిచ్చేవాడు. ఆమె చదువుకుని "Thanks for Your Help." అని చీటీ వ్రాసి పంపేది.—సూరి అలాంటి చీట్లన్నిటిని జాగ్రత చేసి ఫ్రేము కట్టించి బట్టల పెట్టె అడుగున భద్రపరిచి గోపాలానికి చూపించి గొప్ప చెప్పుకునేవాడు. ఇవన్నీ చూసి సూరి, సరళలకు చాల సన్నిహితసంబంధం ఉందనుకునేవాడు


## తెల్ల వెంట్రుకలుండవు

(GOVT REGD)

రంగులనుచూచి మోసపోవద్దు.అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును, ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. జ్ఞాపకశక్తిని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 5-0-0. 3 సీసాలు రు.12-0-0, సగము నెరసివుంటే ఒక సీసా రు. 6-0-0 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/- లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.

GENERAL LABORATORIES,
(P. W) P.O. Rajdhanwar (H. Bhag.).



## కలవరపడు స్త్రీలకు



"కుమారి" మాత్రలు మరువకండి మీ ఆరోగ్యం రక్షించును.చింతఅనవసరం
వెల (సాదా) రు. 3/-
(స్పెషల్) రు. 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజిప్యాకింగు ప్రత్యేకం

Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta-40.

Stockists —(1) Indo Medical Supplies, 3, Pauliappan St., G. T. Madras;
(2) L. M. Mukerji & Sons Ltd., 167, Dharamtola St., Cal—13.

గోపాలం. కాని ఒక సందర్భంలో సరళే తనదగ్గర యిలాఅంది!-"అతనా!-సూరి!-వట్టి Simpleton C. M. G. Brother." తెల్లబోయాడు గోపాలం!-

కాని అప్పటికప్పుడే సూరి సలహా ననుసరించి సుగుణకు- తన క్రొత్తభార్యకు ప్రేమలేఖలు వ్రాశాడు. సుగుణకంతా అయోమయంగా ఉంది. అర్థంకాక సమాధానం వ్రాయలేదు. ముందు గోపాలం మండిపడ్డాడు. ఉత్తరానికి-అందులోనూ అత్యంత ప్రేమాపేక్షలతో వ్రాసిన ప్రణయలేఖకు సమాధానం వ్రాయకపోవడ మేమిటి అని!- తర్వాత తర్వాత ఆలోచించసాగాడు. సుగుణకు పాపం యిలాంటి వేమీ తెలియవు"అని అయినా యిలాటి విషయాలతో బుర్ర పాడు చేసికొంటే పరీక్షపోతుందని పట్టుదలతో పరీక్షలకు చదవసాగాడు.

* * *

పరీక్షా ఫలితాలు తెలిశాయి. ఫస్టు క్లాసులో పాసయాడు గోపాలం! లెక్చరర్లంతా అభినందించారు తల్లిదండ్రుల ఆనందానికి అంతులేదు. గోపాలం ఎంతగా ఉప్పొంగి పోయాడో ఆతనికే తెలియదు. పిల్ల వచ్చిన వేళావిశేషం అన్నారు. ఈశుభవార్త విని సుగుణ ఎంత ఆనందిస్తుందో, తన్నెంత పొగడుతుందో అనుకుంటూ భార్యదగ్గర కెళ్ళాడు గోపాలం! "పాసయారుటగా! బాగుంది!" అని మాత్రం అంది సుగుణ! గోపాలం దెబ్బతిన్నాడు. తానెంతో కష్టపడి సాధించిన యీ ఘన విజయానికి తన ప్రాణేశ్వరి యీయవలసిన కాంప్లిమెంటు యిదేనా?— "You are wonderful! Your speech is marvellous." అంటూ అభినందించేవారే తన కాలేజీ ఆడపిల్లలు-అలాటిది తన భార్య యిలాగేనా అభినందించడం!-అబ్బే-తన తల తీసేసినట్లనిపించింది గోపాలానికి! కాని సుగుణ నెమ్మదిలోను, మౌనంలోనే యిమిడి ఉన్నాయి, ఆమె ఆదరాభిమానాలు, గౌరవ మర్యాదలు అని గోపాలానికి తెలియదు.

చదువు పూర్తయిపోగానే భార్యని పోషించాల్సిన బాధ్యత గోపాలం నెత్తిన పడింది. ఎంతకాలం తల్లితండ్రుల చాటున వారిసొమ్ము తింటూ బ్రతగ్గలను? అని ప్రశ్నించుకున్నాడు!- ఫలితం!- ఉద్యోగాన్వేషణ!- గోపాలం మొదటినుంచీ అదృష్టవంతుడే!- ప్రక్క ఊళ్ళోనే ఉద్యోగం దొరికింది. సుగుణతో క్రొత్తకాపరం ప్రారంభించాడు. తనుకోరిన సుగుణనే పెళ్లి చేసికొన్నాడు. ఫస్టుగా ప్యాసయాడు. అందరికీ మల్లేనేకాక తనకు చదువు పూర్తవగానే ఉద్యోగం వచ్చింది. యింకేం కావాలి? నిజంగా తాను అదృష్టవంతుడేనని అనుకున్నాడు. కాని క్రమక్రమంగా ఉద్యోగం రోజులు దొర్లగా గ్రహించాడు. తనకు సౌఖ్యం కలగటంలేదు. ఉద్యోగం సక్రమంగానే సాగుతోంది. యిక పోతే సుగుణ విషయంలో!-ఆమె తనని అర్థంచేసికోవటం లేదు. ఆమెకోసం తానెంత త్యాగంచేశాడు? తల్లిమాట కాదని కట్నం కానుక లేకుండా ఆమెను వివాహమాడాడు. అయినా ఆమె ఆవిషయాన్ని యీషణ్మాత్రం గుర్తించినట్లు లేదు. ఆమెకు అర్థం చేసికొనే శక్తి లేనట్టుంది. తాను అంటోనీలా ఊహించుకుని ఆమెను క్లియోపాట్రాగా ఆరాధించాడు. కాని తాను ఆంటోనీ అవగలడేమోగాని ఆమె క్లియోపాట్రా మాత్రం యీజన్మకు అవలేదు. ఆమెకు తనకు ఉత్తర దక్షిణధ్రువాల కున్నంత దూరముంది. తెలివితేటల్లో ఆమెకు తనకు కొన్ని వందల యోజనాల దూరముంది. ఆమెకు తనకు ఎందులోనూ పోలిక కనపడ్డం లేదు. ఎందులోనూ ఆమెకు తనకు ఏకాభిప్రాయం కుదరటంలేదు. ఆమెది తనది భిన్న హృదయాలు - జీవితమంటే గులాబీ పూలు పరచబడిన పాన్పు లాంటిదని ఊహించకపోయినా, గులాబీ ముళ్ళు గుచ్చుకోకుండా కాపాడుకోవాలని ఆశిస్తూవచ్చాడు. కాని అంతా తారుమారయింది. భిన్నాభిరుచులు, భిన్న హృదయాలు కలిసిన తమని పెళ్లి పేరిట శాశ్వతంగా ఏకం చేసేశారే అని ఎంతో బాధపడ్డాడు. ఆమెతో నిరుత్సాహంగా ఎంతకాలం యిలా జీవితం గడపగలడు?- ఏమైతేనేం - పెళ్ళి విషయంలో తాను పెద్ద పొరపాటు చేశాననే నిర్ణయానికొచ్చాడు గోపాలం!-ఆనాడు పెళ్ళిరోజున తన కళ్ళుమూసుకుపోయాయి అనుకున్నాడు. ఈ ఆలోచనలతో పాపం గోపాలానికి ఎప్పుడో నిద్ర పట్టేసింది. ★




